

తిరుమల శ్రీవారికి బంగారు కానుక



ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారికి కోటి 25లక్షల విలువ చేసే 2 కిలోల బంగారు శంఖం, కూర్మ పీఠాన్ని ఇన్ఫోసిస్ అధినేత సుధా నారాయణమూర్తి దంపతులు విరాళంగా అందజేశారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తుల కైంకర్యాలకు వినియోగించే బంగారు అభిషేక శంఖం, కూర్మ పీఠాన్ని ఈవో ధర్మారెడ్డికి ఆదివారం అందజేశారు. నారాయణమూర్తి దంపతులను ఈవో శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేయగా వారు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

కొత్త రేషన్ కార్డులెప్పుడో..?

- జిల్లాలో సుమారు 20 వేలకు పైగా దరఖాస్తులు
- మార్పులు, చేర్పులకు ఎదురుచూపులు
- అర్హులైన లబ్ధిదారులకు తప్పని ఇక్కట్లు



ప్రజాశక్తి - బాలాయపల్లి:

అంగట్లో అన్నీ ఉన్నా... అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది జిల్లాలో రేషన్‌కార్డుల వ్యవహారం. రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడంతో జిల్లాలో రేషన్ బియ్యంరాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా రేషన్‌కార్డుల్లో ఇతర కుటుంబసభ్యుల పేర్లను చేర్చకపోవడంతో తిప్పలు ఎదురవుతున్నాయి. ఒక వైపు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడం, మరో వైపు పాత రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు చేయకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు నిరాశకు గురవుతున్నారు.

ఆహార భద్రత కార్డులు..

జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 1092 రేషన్ దుకాణాల ద్వారా ప్రతినెలా పేదలకు ఉచిత బియ్యం, రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. జిల్లాలో మొత్తం 5,27,852 రేషన్ కార్డులుండగా ఇందులో 3,93,354 ఆహార భద్రతా కార్డులు, 24,352 అంత్యోదయ కార్డులు,746 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ప్రతినెల సుమారు 11,197 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సుమారు 10,87,297 మందికి పౌరసరఫరాశాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు.

కొత్త కోడళ్లకు దక్కని రేషన్..

రేషన్‌కార్డుల్లో (ఆహార భద్రతకార్డు) పేర్లను సులభంగా తొలగిస్తున్నా.. అదే స్థాయిలో పేర్ల చేర్పును చేపట్టకపోవడంతో పుట్టింటి నుంచి మెట్టింటికి వెళ్లిన కొత్త కోడళ్లకు రేషన్ కోటా దక్కని పరిస్థితి ఎదురవుతోంది. వివాహమై ఇంటిపేరు మారిన రేషన్‌కార్డులో మాత్రం పేరు నమోదు కావడం లేదు. జిల్లాలో వేల మంది కొత్తకోడళ్లు పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్న.. అధికారులు సరైన సమాచారం ఇవ్వలేని పరిస్థితి ఈ విషయమై మూడేళ్లుగా దరఖాస్తులు పేరుకుపోయాయని తెలుస్తోంది. పేర్ల తొలగింపు ప్రక్రియ మాత్రం నిరంతరంగా కొనసాగుతోంది. పేరు నమోదుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్‌ను ప్రభుత్వం లాక్ చేయడంతో సమస్య ఏర్పడుతోంది.

పేరుకుపోతున్న దరఖాస్తులు..

పెళ్లి కాగానే కార్డుల నుంచి పేర్లు తొలగుతాయని కొందరు యువతులు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. వారి పేరుతో ఉన్న యూనిట్‌ను అధికారులు తొలగిస్తున్నారు. అత్తారింటి కార్డులో పేరు చేర్చే ఆప్షన్ లేకపోవడంతో కొందరు తొలగింపునకు అంగీకరించడం లేదు. సదరు కార్డులు అలాగే కొనసాగుతుండగా పలు గ్రామాల్లో పేర్లు తొలగించాలని తహసీల్దార్లకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ మేరకు విచారణ చేసి తొలగిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలో రేషన్‌కార్డులో ఒక్క పేరు కూడా చేర్చలేదని అధికారులు అంటున్నారు. మూడేళ్లలో పేరు నమోదుకు నిరీక్షిస్తున్న వారి సంఖ్య సూమారు 20వేలకు పైచిలుకు ఉన్నట్లు తెలుస్తోంది. కొత్తగా పెళ్లి, వేరు కాపురం ఉంటున్న వారు కొత్తకార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల సంఖ్య కూడా భారీగానే ఉంది.

తొలగింపులు సులువే..

ఐదేళ్లలో మరణించిన వారి పేర్లు ఇంకా కొనసాగు తుండటంతో యూనిట్ల సంఖ్య అలాగే ఉండటం వల్ల రేషన్ పక్కదారి పట్టే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. కొత్తగా పెళ్లి అయినవారు మతిచెందిన వారి వివరాలు సేకరించి తొలగిస్తున్నారు. పెళ్లి అయిన వెంటనే పేరు తొలగింపునకు స్థానికంగా మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత అధికారి విచారణ చేసి తహశీల్దారు లాగిన్‌కు పంపిస్తారు. పేరు తొలగిచినట్లు తహసీల్దారు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం తీసుకొని డీఎస్ఓ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. విచారణ చేసి పేరు చేరుస్తారు. దీనికి కమిషనరేట్ నుంచి ప్రత్యేక అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కూడా అత్తారింటికి ఉన్న కార్డులో మాత్రమే పేరు చేరుతుంది. కొత్తగా పెళ్లైన జంటకు మాత్రం కార్డు జారీ అయ్యే అవకాశం లేదు. ప్రభుత్వం ఆప్షన్ ఇస్తే పరిశీలించి నమోదు చేస్తామని సంబంధిత అధికారులు అంటున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం...

జిల్లా సివిల్ సప్లయి అధికారి

జిల్లాలో రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులపై వచ్చిన దరఖాస్తుల వివరాలను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాం. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల వివరాలను పంపుతున్నాం. కొత్త కార్డులను మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చే మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం.



21వ తేదీన జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి

హెలిఫ్యాడ్ ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరి పట్టణ పరిధిలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమతి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దిగడానికి హెలి ప్యాడ్‌ను రోడ్డు భవనాల శాఖ ఈఈ రామాంజనేయులు ఆధ్వర్యం, పర్యవేక్షణలో భూసాయల్ పరీక్షలు చేసి పైగట్టు మట్టిని ఒక అడుగు లోతు తవ్వి ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా హెలికాప్టర్ దిగడానికి ఆటస్థలంలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. సీఎం కాన్వాయ్ విశ్వోదయ కళాశాల నుంచి తిరుపతి మార్గంలో ఉన్న ఎస్ఎల్ఆర్ కళ్యాణ మండపం పక్కన బహిరంగసభకు వెళ్లే మార్గాన్ని రోడ్డుకి ఇరువైపులా మున్సిపల్ అధికారులు శుభ్రం చేయిస్తున్నారు. 21వ తేదీ అధికసంఖ్యలో రానున్న ప్రజానీకాన్ని దష్టిలో ఉంచుకుని తిరుపతి మార్గంలోని భారత్ పెట్రోల్ బంకు దగ్గర బస్సులు పార్కింగ్, బహిరంగ సభ ఎదురు విఐపిల పార్కింగ్, పక్కన వివిఐపిల పార్కింగ్, పాఠశాలల్లో, విశ్వదయ డిగ్రీ కళాశాలలో వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈఏర్పాట్లు గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ఎమ్మార్వో పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకట రామయ్య, ఆర్అండ్ బి ఏఈ బాబు ఉన్నారు.



సిఎం పర్యటనకు ఏర్పాట్లు చేయిస్తున్న అధికారులు

దారుణం.. అమానుషం.. ఘోరం..!

- నిండు గర్భిణీ పై 8 మంది దాడి
- గర్భస్థ శిశువు మృతి, కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న తల్లి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందని కారణంతో ఓ నిండు గర్భిణీ పై ఎనిమిది మంది దాడి చేసి చిత్రహింసలకు గురి చేశారు. ఈ ఘటనలో గర్భస శిశువు మతిచెందగా కొనఊపరితో తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన పలువురిని విస్మయానికి గురి చేసింది. కొప్పేడు దళితవాడికి చెందిన సత్యవాణి నిండు గర్భిణి. అదే గ్రామానికి చెందిన మధుబాబు అతని తండ్రి కేశవులు గతంలో చేసిన దౌర్జన్యాలపై సత్యవాణి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న కోపంతో కక్ష పెంచుకున్నారు. ఈనెల 9వ తేదీ సత్యవాణి ఇంట్లో ఒంటరిగా ఉండడానికి గమనించి, మధుబాబు, తమ పిన్ని (కమలమ్మ), చెల్లెళ్ళు (హారతి, హంస), తమ్ముళ్లు (మోహన్లాల్, కమల్చంద్రన్, గజ), బావమరిది (ధనరాజ్ దిగువపుత్తూరు)తో కలసి పక్కా ప్రణాళికతో సత్యవాణి (నిండు గర్భిణి)పై దాడిచేశారు. గర్భవతిని పట్టుకొని కడుపుపై అందరూ మూకుమ్మడిగా ఎదపై, కడుపుపై తన్నడంతో తీవ్ర రక్తస్రావం అయింది. తరువాత కనకమ్మ రెండు చేతులను మధుబాబు పట్టుకొనగా పిన్ని, చెల్లెళ్ళు, తమ్ముళ్లు, బావమరిది కలిసి తలపై ఎదపై చితక బాదారు. హంస కత్తి పట్టుకొని భయభ్రాంతులకు గురిచేసింది. ఈ ఘటనలో సత్యవాణి గర్భంలో ఉన్న శిశువు మతి చెందగా, తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో కొన్నప్రాణాలతో చికిత్స పొందుతుంది. గత ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సత్యవాణిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధితురాలు ఆమె కుటుంబ సభ్యులు మీడియా ముందు తమ గోడును వెల్లబోసుకున్నారు. పోలీసులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పనులు కోరుతున్నారు.





మృతిచెందిన శిశువు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ సత్యవాణి

రుయాలో వైద్యసేవలు విస్తృతం

- పలు అభివృద్ధి కార్యక్రమాలు
- అందుబాటులో క్రిటికల్ కేర్ వైద్యం
- సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు



ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- తిరుపతి సిటి

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఆసుపత్రుల అభివృద్ధికి వందలాది కోట్లు కేటాయిస్తోంది. ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకుని రుయా ఆసుపత్రిని కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తామని రుయా సూపరింటెండెంట్ డాక్టరు రవిప్రభు తెలిపారు. ఇటీవలే బాధ్యతలు తీసుకున్న ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ రుయా అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 400కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. నాడు- నేడులో భాగంగా అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 90 కోట్ల రూపాయలను విడుదల చేసిందని, ఆసుపత్రిల్లో వివిధ పనుల నిమిత్తం 20కోట్ల రూపాయల వరకు ఇప్పటికే వెచ్చించామని చెప్పారు. కార్పొరేట్ తరహాలు రుయా క్రిటికల్ కేర్ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రూ.23.75కోట్లతో 16వేల చదరపు అడుగల విస్తర్ణంలో ఐదు అంతస్తుల భవాన్ని నిర్మించనున్నామని తెలిపారు. ఇందులో క్రిటికల్ కేర్‌తో పాటు ఆపరేషన్ థియేటర్లు (ఓటి), ఐసియా, సెంట్రల్ ల్యాబ్, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, డిజిటల్ ఎక్సరే, డయాగ్నోస్టిక్ బ్లాక్, లెక్చరర్ హాల్, ఎగ్జామినేషన్ హాల్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ తదితర వాటిన్నటిని ఒకేచోట ఉండేలా ప్రతిపాదనలు అమలు చేస్తున్నామన్నారు. ఏడాది కల్లా భవనాన్ని నిర్మించి పేదలకు అత్యాధునిక వైద్యసేవలను అందించేందుకు చర్యలు మొదలయ్యాయని తెలిపారు.

ప్రాధాన్యతా క్రమంలో పనులు...

నాడు-నేడు పథకం ద్వారా రుయా, ఎస్వి మెడికల్ కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 400కోట్ల రూపాయలు కేటాయించింది. ఇందులో 90కోట్ల రూపాయల పనులు ప్రారంభమయ్యాయి. ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేస్తాం. ఈ నిధులతో పాటు ఆసుపత్రి, మెడికల్ కళాశాల మెయింటెన్స్‌కు ఎప్పుడు లేనివిధంగా ఈ ఏడాది 65లక్షల రూపాయలు కేటాయించిందన్నారు. ఎప్పటికప్పుడు భవనాల ఆధునీకరణ, మరమ్మతుల కోసం రుయాకు 3.5కోట్ల రూపాయలు, ఎస్వి మెడికల్ కళాశాలకు 2.5కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

పెరిగిన మెడికల్ కళాశాల స్థాయి

రాష్ట్ర ప్రభుత్వం కృషితో నేషనల్ మెడికల్ కౌన్సిల్ తిరుపతిలోని ఎస్వి మెడికల్ కళాశాలకు 93సీట్లను ఇటీవల మంజూరు చేసింది. ఈ స్థాయిలో పీజీ సీట్లు పెరగడం ఇదే తొలిసారి. పెరిగిన పిజి సీట్ల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు రెట్టింపు స్థాయిలో మంజూరవుతాయన్నారు. వసతి, వైద్యవిద్య సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం 90కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. దీనికి అదనంగా మరింత నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు.

లోపాలను అధిగమిస్తాం..

రుయా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టగా ఇక్కడి లోపాలను గుర్తించాను. వాటిని అధిగమించడంపై దృష్టి సారించాను. ట్రయేజ్, అత్యవసర విభాగాన్ని వెంటనే గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది. విబాగాధిపతులు, వైద్యాధికారులతో సమీక్షలు నిర్వహించి అందరి సమన్వయంతో అత్యవసర విభాగాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతాం. ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోల కొరతను అధిగమిస్తాం. సిఎంఓలు, పిజిలను 24 గంటలూ ఖచ్చితంగా అందుబాటులో ఉంచుతాం. టిటిడి చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంతో పల్మనాలజీ వార్డు తొలగించాల్సి వస్తోంది. ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి చొరవ తీసుకుని టిటిడినే కొత్త భవనాన్ని కట్టించి రుయాకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. రుయాకు 750 పడకల ఆసుపత్రిగా గుర్తింపు ఉంది. కానీ సుమారు 1200 పడకలకుపైగా రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాం. దీని వల్ల కొంత సిబ్బంది సమస్యలు ఉంది. దాన్ని కూడా అధిగమించి, వైద్యం కోసం రుయా ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒకరికి నాణ్యమైన వైద్యం అందించి, స్వస్తత చేకూర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని రుయా సూపరింటెండెంట్ తెలిపారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు 'ఆర్కే అబాకస్'

విద్యార్థులకు సులభ మార్గంలో గణిత అధ్యయనం

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతిలోని స్థానిక ఎంఆర్‌పల్లిలోని ఆర్కే అబాకస్ పాఠశాలలో సులభ మార్గంలో విద్యార్థులకు సాధారణమైన అసాధారణమైన గణిత లెక్కలను సులభంగా నేర్పించడం జరుగుతుంది. అబాకస్ విద్యను అతి తక్కువ ఖర్చుతో విద్యార్థులకు అందించే అత్యుత్తమమైన విలువైన సమయంలో సమయాన్ని వధా కాకుండా శిక్షణ ఇస్తున్న ఏకాక సంస్థ ఆర్కే అబాకస్ అని ఆ సంస్థ డైరెక్టర్ చైర్మన్ తాతిరెడ్డి రామకష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ చిన్న పిల్లలలో అబాకస్ విద్యను అందించడం ద్వారా అతి చిన్న వయసులోనే గణిత మేధావులుగా తీర్చిదిద్దవచ్చు అన్నారు. అక్షరమే ఆయుధంగా సులభమైన గణిత సమస్యలను వయసులోనే విద్యార్థులు పరిష్కరించేందుకు అబాకస్ అత్యుత్తమైన సంస్థ అన్నారు. చిన్నపిల్లలకు చిన్న వయసులోనే అబాకస్ విద్యను అందించడం ద్వారా నాలుగు, ఐదు,ఆరు, ఏడు తరగతులలో రాష్ట్ర జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక, నవోదయ, ఐఐటి, ట్రిబుల్ ఐటీ, ఒలంపియాడ్, రెసిడెన్షియల్ స్కూల్స్, ఏపీఆర్జేసీ వంటి పోటీపరీక్షల్లో గణితంలోని సమస్యలను సులభంగా అతి తక్కువ సమయంలో పరిష్కరించేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. అబాకస్ శిక్షణలో ఎటువంటి ప్రత్యేకమైన సిలబస్ అనేది పాఠ్యాంశాలు అనేటివి ఉండవని విద్యార్థుల చిన్న పిల్లల సామర్థ్యాన్ని బట్టి వారి తెలివితేటలను బట్టి గణిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే సూచనలు సలహాలు, చిట్కాలు వివిధ మార్గాల ద్వారా వివిధ బోధన పద్ధతుల ద్వారా వారికి అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అతిచిన్న వయసులోనే కంప్యూటర్లోని పోటీ పరీక్షలు ఏ విధంగా రాయవచ్చును సులభంగా నేర్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు వారు ఆశించిన మేరకు వారి పిల్లలలో అబాకస్ శిక్షణలో విభిన్నంగా రాటుదేలేందుకు తమ సంస్థ కషి చేస్తుందన్నారు. ఈ అబాకస్ శిక్షణను ఎమ్మార్పల్లిలో ప్రధాన కేంద్రంగా అన్నారావు సర్కిల్లో ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేశామని భవిష్యత్తులో అన్నమయ్య సర్కిల్లో కూడా మరొక శిక్షణాకేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గణితంలో వివిధ రకాల సమస్యలను ఎటువంటి ట్యాబులను వినియోగించకుండా తమ శిక్షణ ద్వారా విద్యార్థులు అవలీలగా గణిత సమస్యలకు పరిష్కారం క్షణకాలంలో పరిష్కరిస్తారన్నారు. విద్యార్థులకు చిన్నవయసులో అబాకస్ శిక్షణ ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో ఎన్నో గణిత సమస్యలను పరిష్కారాలకు మార్గం సుగమం అవుతుందన్నారు. ప్రతి సంవత్సరం అబాకస్ కాంపిటీషన్లో ఆర్కే అబాకస్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని ఇందుకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. జిల్లాలో ఎక్కడ అబాకస్ పోటీలు జరిగిన ఆర్కే అబాకస్ విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తున్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో కూడా విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాల మేరకు విజయం సాధిస్తున్నారన్నారు. ఆర్కే అబాకస్ సెంటర్లో ప్రత్యేకమైన అనుభవం కలిగిన పీహెచ్డీ పట్టా పొందిన సీనియర్ ఆధ్యాపకులచే గణిత సమస్యలకు సంబంధించిన శిక్షణ అత్యుత్తమంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. వివిధ సేవా సంస్థలలో పనిచేసే పేద విద్యార్థుల పిల్లలకు 20 నుంచి 50శాతం వరకు ఫీజు తగ్గించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా వేసవి శిక్షణ కేంద్రాలను, క్యాంపులను ఏర్పాటు చేస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు ఎంఆర్‌పల్లిలోని ఆర్కే అబాకస్ సెంటర్‌ను సంప్రదించాలని, నెంబర్లు 998950074, 900976246 చరవాణి నెంబర్లకు సంప్రదించాలని కోరారు.



ఆర్కే అబాకస్ కేంద్రం డైరెక్టర్ చైర్మన్ రామకృష్ణారెడ్డి



3 ప్రాంతాల్లో 19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

20 మంది తమిళ స్మగ్లర్లు అరెస్టు



ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): రాజంపేట, తిరుపతి జిల్లాల్లోని మూడు ప్రాంతాల్లో 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, 20మంది స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్సు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఆదివారం విలేకరులతో డిఎస్పీ మాట్లాడుతూ తమ హెచ్‌ఓడీ, కర్నూలు రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ కె.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన మూడు ఆర్ఎస్ఐలు సురేష్ బాబు, వై.విశ్వనాథ్, కెవిఎస్‌కె.లింగాధర్ టీమ్‌లు తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయం నుంచి మూడు ప్రాంతాలకు కూంబింగ్ చేపట్టారని తెలిపారు. ఇందులో ఒక టీమ్ అన్నమయ్య జిల్లా తుమ్మలబైలు సెక్షన్ చాకిరేవు కోసం సమీపంలో అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారని, మరో టీమ్ అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజి ఫించా సెక్షన్ దిన్నెల ఫారెస్టు బీటు, చిట్టికురవ రాస్తాకోన సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతానికి వెళ్లారన్నారు. ఇంకొక టీమ్ తిరుపతి జిల్లా నాగపట్ల సెక్షన్లోని తిరుపతి పీలేరు రోడ్డులో గల వెంకట పద్మావతీ ఇన్‌స్టిట్యూట్ కళాశాల ఎదరుగా ఉన్న అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారన్నారు. ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారని, వారిని మూడు వైపుల నుంచి టాస్క్ ఫోర్సు టీమ్ లు చుట్టుముట్టిఅరెస్టు చేశారని తెలిపారు. వీరు మొత్తం 20మంది ఉండగా, వారిలో తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టు తాలూకాకు చెందిన రమేష్ (42), సురేష్ సాంబశివం (38), నవీన్ వెంకటేశన్ (23), సెంగోదరన్ మునిస్వామి (29), తిరువన్నామలై జమునామత్తూరుకు చెందిన కొళందై చిన్నపయ్యన్ (50), కల్లకురిచ్చి జిల్లాకు చెందిన ఏలుమలై (33), సామికన్ను పచ్చయ్యన్ (37), గణేశన్ పిచ్చన్ (28), అనంతరామన్ (19), అన్బు పచ్చన్ (40),అళగేషన్ కుమారస్వామి (36), సెంథిల్ రామన్ (30), తిరుపత్తూరు జిల్లాకు చెందిన వెంకటేశన్ కాళి (34),రంగనాథన్ పెరుమాళ్ (39), అదే జిల్లా ఆంబూరు తాలూకాకు చెందిన మురళి మురుగన్ (24), ఎల్లియన్ (57), వేలు రత్నం (36), ముత్తురామన్ చిన్నపయ్యన్ (40), దామోదరం రాజా (46), సత్యవేలు రత్నం (27)లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులను సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ చెరుకూరి షఫీ నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మరికొంతమంది అడవుల్లో ఉన్నారని సమాచారం అందుకోవడంతో, మరికొన్ని బలగాలు అడవిలో కూంబింగ్ చేపడుతున్నాయని తెలిపారు. ఎర్రచందనం దుంగల విలువ రూ.50లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు.

పోలీస్ వర్సెస్ మున్సిపల్ చైర్మన్

నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర ఉద్రిక్తత



ప్రజాశక్తి- సూళ్లూరుపేట: మున్సిపల్ వైస్సార్సీపీ కో-ఆప్షన్ సభ్యులు కలత్తూరు సునీల్ రెడ్డినీ ఆదివారం ఉదయం సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌కు ఎస్సై రవిబాబు పిలిపించారు. సునీల్‌రెడ్డి గతంలో విలేకరుల సమావేశంలో పోలీసులు, మున్సిపల్ అధికారుల పనితీరును దుయ్యబట్టారు. పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ఈనేపథ్యలో ఆదివారం ఉదయం ఎస్ఐ రవిబాబు గతంలో మీపై కేసులున్నాయని రౌడీషీటర్లతో మాట్లాడాలని కలతూరు సునీల్ రెడ్డిని స్టేషనకు పిలిపించి బూతులు తిడుతూ, సునీల్ రెడ్డిపై లాఠీ, కోరాడాతో కొట్టి స్టేషన్లో కూర్చోబెట్టారు. విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి స్టేషన్ వచ్చారు దీంతో నాయకులు పోలీసులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ తీవ్రభావోద్వేదానికి లోనై సునీల్ రెడ్డినీ చూపించాల్సిందే అని స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఒక దశలో పోలీసులు, నాయకులకూ కార్యకర్తలు మధ్య తీవ్రంగా తోపులాట జరిగింది. అనంతరం పోలీసులు వెనక్కి తగ్గి కలతూరు సునీల్ రెడ్డిని విడిచిపెట్టారు.

పేటలో ఘనంగా సిఐటియు మండల మహాసభ

నూతన కార్యవర్గం ఎన్నిక



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: సిఐటియు మండల మహాసభ ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో ఘనంగా జరిగింది. ఈసభకు సిఐటియు అధ్యక్షులు ఎస్.సాంబశివయ్య అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులు తిరుపతి జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య విచ్చేసి మాట్లాడారు. జిల్లాలో సూళ్ళూరుపేట పారిశ్రామికంగా మంచి గుర్తింపు ఉందని, కార్మికులు వేతనాలు, సంక్షేమం రక్షణ కొరకు నిరంతర అండదండగా ఉంటామన్నారు. సిఐటియు కార్యదర్శి సిహెచ్.సుధాకర్‌రావు నాలుగు సంవత్సరాల కార్యక్రమాల నివేదికను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్.సాంబశివయ్య, అధ్యక్షులుగా రమణయ్య, కార్యదర్శిగా లక్ష్మయ్య, కోశాధికారిగా పద్మనాభయ్య, 18 మంది కమిటీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు సుంకర అల్లెయ్య మాట్లాడుతూ కొత్త కమిటీకి తమ అభినందనలు తెలియజేస్తూ ఎల్లవేళలా సహకారం ఉంటుందన్నారు. సభకు పి.మనోహారం వందని సమర్పణ చేశారు.

వీఆర్వో మనోజ్ కుమార్‌కు సన్మానం



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మండలం రెవెన్యూ పరిధిలోని పూదూరు, విన్నమాల వీఆర్వోగా పనిచేస్తున్న మనోజకుమార్‌ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఘనంగా సన్మానించారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సంఘ ఎన్నికల్లో వీఆర్వో మనోజ్ ను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు ఆయనకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయుడుపేటలో కిలివేటి సంజీవయ్య కార్యాలయంలో వీఆర్వో మనోజ్ కుమార్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, పూదూరు ఉపసర్పంచ్ పిల్లసిరి మణి, రెండవ వార్డ్ కౌన్సిలర్ పాలేటి నాగార్జున, తొప్పాని రమణయ్య పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించుకోవడమే ముస్లింల లక్ష్యం




ప్రజాశక్తి-గూడూరు టౌన్: మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మగ్దూం మొహిద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని దర్గా వైసిపి ముస్లీం మైనార్టీ కార్యాలయాన్ని నాయకులతో కలిసి వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మగ్ధూమ్ మాట్లాడుతూ గతంలో 2014 నుంచి 2019 వరకు మైనారిటీ కార్యాలయాన్ని నిర్వహించామన్నారు. రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీల పార్టీ అని.. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివద్ధి రెండు కళ్లగా పరిపాలన అందిస్తూ ప్రజల ఆశీర్వాదాలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువజన నాయకులు కొట్టు అశోక్, మైనార్టీ నాయకులు బాబు, యస్దాని బాషా,జమీర్, షబ్బీర్, సందాని బాషా, , అర్షద్, షాకిర్, బిఎస్ఎన్ఎల్ యస్దాని, నయీమ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

'ఇలాగైతే టీడీపీలో కొనసాగలేం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అడుగడుగునా అవమానాలు భరిస్తూ టీడీపీలో కొనసాగలేమని ఆ పార్టీ బీసీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ముఖ్య అనుచరుడు శివా యాదవ్, ఆయన అనుచర వర్గం ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో నిమ్న వర్గాలకు ప్రాధాన్యత లేదనీ, వారిని అడుగడుగునా అవమానిస్తున్నారని మీడియా ఎదుట వాపోయారు. శివా యాదవ్, ఆయన అనుచరులు ఆదివారం స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' బస్సు యాత్రలో పాలుపంచుకున్న తనపై టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అనుచితంగా ప్రవర్తించారని శివ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అనుచరుడునని చెబుతున్నా వినకుండా బస్సు దిగమన్నాడనీ, అంతటితో ఆగకుండా కులం పేరుతో దూషిస్తూ అనుచరులతో దాడి చేయించాడని ఆరోపించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఒక పార్టీకి నాయకత్వం వహిస్తున్న సుధీర్ రెడ్డి ఇలాంటి తరహా చర్యలకు పాల్పడటం పార్టీకి నష్టాన్ని చేకూరుస్తాయని హెచ్చరించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తాను పార్టీ కోసం కష్టపడుతున్నాననీ, ఎస్సివి నాయుడు టిడిపిని వీడటంతో ఆయన వెంట నడిచామని గుర్తు చేశారు. తిరిగి సొంత గూటికి చేరితే సాదర స్వాగతం పలకకుండా అవమానించేలా వ్యవహరించడం ఆయనకే కాకుండా పార్టీకి తీరని నష్టమని స్పష్టం చేశారు. సుధీర్ రెడ్డి నాయకుడిగా అన్ని వర్గాలను కలుపుకుని పోవాలే గానీ, వర్గ పోరు సష్టించి లబ్ధి పొందాలని చూడటం సహేతకం కాదన్నారు. ఎస్సీవీ వర్గీయులుగా తామంతా టీడీపీ గెలుపు కోసం పనిచేస్తున్నామనీ, చంద్రబాబు ఎవరికి టికెట్ ఇచ్చినా ప్రాణం పెట్టి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. అయితే సుధీర్ రెడ్డి తన అహంకారపూరిత ధోరణితో పార్టీకి నష్టాన్ని చేకూర్చే పనులు చేస్తున్నాడని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆయన తీరు మారకుంటే వచ్చే ఎన్నికల్లో 30 వేల మంది యాదవులు గట్టిగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు. చెంచయ్య, కిషోర్, ఏసు, రమేష్, గోవిందరాజులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ప్రజాశక్తి-రేణిగుంట: రైతులకు వ్యవసాయ సాంకేతికతను తెలియజేయడమే ముఖ్య ఉద్దేశమని రాస్ కేవీకే శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం కరకంబాడి సమీపంలోని రాష్ట్ర కషి విజ్ఞాన కేంద్రంలో ఐసీఏఆర్ 95వ వ్యవస్థాపక వ్యవసాయ సాంకేతిక దినోత్సవం వేడుకలను రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, చిత్తూరు డిప్యూటీ డైరెక్టర్ రత్నప్రసాద్ పాల్గొని వ్యవసాయ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాస్ కషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో పనిచేస్తున్న వ్యవసాయ పరిశోధనా కేంద్రాల నుంచి ఉత్పత్తి అయిన నూతన సాంకేతికతను విస్తరణ కేంద్రాలలో విజ్ఞాన యాత్రలు, శిక్షణ కార్యక్రమాలు, వ్యవసాయ ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో రైతులకు చేరువ చేయడమే ఈ సాంకేతికత దినోత్సవం ప్రాముఖ్యత అన్నారు. చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, భూసార పరీక్షా విధానం ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయ విధాన ప్రాముఖ్యత, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ ల వినియోగం, సమగ్ర వ్యవసాయ విధానం గురించి వివరించారు. ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ రత్నప్రసాద్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.జి. కృష్ణారెడ్డి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.టి. ప్రతిమ, చిత్తూరు ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ రత్నప్రసాద్, డా.జి. కష్ణారెడ్డి, డా.టి. ప్రతిమ, ప్రధాన శాస్త్రవేత్తలు , ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి, డా.వై.రెడ్డిరాము, కార్యక్రమ సమన్వయ కర్త, డాట్ సెంటర్, చిత్తూరు, పుష్పలత, మండల ఉద్యాన అధికారిణి, శ్రీకాళహస్తి, డా.ఎస్.శ్రీనివాసులు రాస్ కషి విజ్ఞాన కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్త, కె.వి.కె శాస్త్రవేత్తలు డా. శ్రీలత, పద్మజ, సుధాకర్, దివ్య, రాము కుమార్, అనూషా పాల్గొన్నారు.

పిట్ట కొంచెం.. కూత ఘనం



- తిరుపతికి చెందిన కొణిదెల రిశ్వాన్ క్రాంతి ప్రతిభ
- రెండేళ్ల వయసులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- అభినందనలు వెల్లువ

ప్రజాశక్తి-క్యాంపస్



సాధారణంగా చిన్నపిల్లలు వేలమందిలో, లక్షలమందిలో ఏ ఒక్కరో, ఇద్దరో అసాధారణ ప్రతిభను కలిగి ఉంటారు. అదే కోవకే తిరుపతికి చెందిన హరిపురం కాలనీలోని తారకరామ నగర్‌కు చెందిన డాక్టర్ కొణిదెల క్రాంతి కుమార్, డాక్టర్ బొమ్ము ఉమాదేవి ఏకైక కుమారుడు రిశ్వాన్ క్రాంతి ఏకసంతాగ్రహిగా పేరుగాంచాడు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులు చెబుతున్న అనేక అంశాలను గుర్తిస్తూ ఒక్కసారికే గుర్తుకు పెట్టుకుని పదేపదే వస్తువును అంకెలను చెప్పడం నేర్చుకున్నాడు. సాధారణంగా చిన్నపిల్లలు రెండేళ్ల వయసులో ప్రస్తుత కాలంలో చరవాణిలోని బొమ్మలు, సినిమాలు, డిస్నీ మ్యాప్ వంటివి చూస్తుంటారు.. కానీ తల్లిదండ్రులు చెప్పే ప్రతి చిన్న విషయాన్ని ఏకాగ్రతతో తన మెదడుకు పనిపెట్టాడు. కొణిదెల రిశ్వాన్ క్రాంతి తల్లిదండ్రులు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బయలాజికల్ సైన్స్‌లో బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో పిహెచ్‌డిలు పూర్తిచేశారు. తండ్రి క్రాంతి కుమార్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఐసిఎంఆర్చే గుర్తించబడిన ప్రతిష్టాత్మకమైన రీసెర్చ్ అసోసియేట్ ఫెలోషిప్‌ను సాధించి బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగం, జువాలజీ లో పరిశోధకులుగా పనిచేస్తున్నారు. చిన్నప్పటినుంచి చిన్నారి రిశ్వాన్ చెప్పిన విషయాన్ని గుర్తుంచుకొని పదేపదే చెప్పేవాడని అన్నారు. చిన్నారి రిశ్వాన్ ఆసక్తిని గుర్తించిన తల్లి బాబుకి 20 జంతువుల పేర్లు, 20 పక్షుల పేర్లు, 12 దేశాల జాతీయ చిహ్నాలు, 16 యాప్‌లు, 11 రంగులు,11 పండ్లు, 11 కూర గాయలు, 8 ఆకారాలు, 22 శరీర భాగాలు, 27 మంది భారతీయ స్వాతంత్ర సమరయోధులు, 23 దేశాల జండాల గురించి, 27 ఖగోళ వస్తువులను, 27 ప్రసిద్ధ ప్రదేశాలను, 22 భారతీయ రాష్ట్రాలను గుర్తించేలా సామర్థ్యాన్ని పెంచుకున్నాడు. చిన్నారి రిశ్వాన్ 26 అక్షరమాల పదాలను, 13 హిందీ అక్షరాలను ఏడు ఖండాల పేర్లను, ఒకటి నుంచి 10వ తేదీ వరకు సంఖ్యలను లెక్కించేలా శిక్షణ ఇవ్వడం జరిగిందని తల్లిదండ్రులు వెల్లడించారు. చిన్నారి వీడియోలను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపించడం జరిగిందని, ప్రతిభను గుర్తించి ఆన్లైన్లో మరొకసారి అతనిని పరీక్షించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించారని వెల్లడించారు. అందుకు సంబంధించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు కొణిదల రిశ్వాన్ క్రాంతి ప్రశంసాపత్రాన్ని, గోల్డ్ మెడల్‌ను, అతని ప్రతిభకు ప్రత్యేకమైన 2023కు సంబంధించిన ఇండియా బుక్స్ ఆఫ్ రికార్డ్ పుస్తకాన్ని ఇంటికి పంపడం జరిగిందన్నారు. చిన్న వయసులో ఘనత సాధించినందుకు సంతోషంగా ఉందని తల్లిదండ్రులు. బంధుమిత్రులు అభినందించారు.

ప్రథమ మహిళా ఉపకులపతుల సదస్సుకు
మహిళా వర్సిటీ వీసీ ఆచార్య భారతి

ప్రజాశక్తి - క్యాంపస్ : హర్యానాలోని ఐఐఎల్ గుర్గావ్‌లో 17, 18వ తేదీలలో జరగనున్న జాతీయ మహిళా ఉపకులపతుల సదస్సుకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి. భారతికి ఆహ్వానం అందిందని పిఆర్ఓ డాక్టర్ ఎన్.రజిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూర్వపు పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ, కేంద్ర మహిళా సాధికారత, శిశు సంక్షేమశాఖ మంత్రి స్మృతి ఇరాణి పాల్గొననున్నట్లు వెల్లడించారు.

నూతన విద్యావిధానంతో ప్రమాదం



ప్రజాశక్తి - క్యాంపస్ : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా డిగ్రీ విద్యలో సమూల మార్పులలో భాగంగానే 3 సంవత్సరాల డిగ్రీ స్థానంలో నాలుగేళ్ల డిగ్రీని తీసుకురాబోతున్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో "ఉన్నత విద్యలో మార్పుల, నాలుగేళ్ల డిగ్రీ – భవిష్యత్ పరిణామాలు" అనే అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ బివి మురళీధర్ మాట్లాడుతూ ఒక దేశాన్ని నాశనం చేయాలంటే బాంబులు, మారణాయుధాలు అక్కర్లేదని.. విద్యా వ్యవస్థను నాశనం చేస్తే, దేశాన్ని నాశనం చేయడం సులభమని ఆఫ్రికాలోని ఒక యూనివర్సిటీ ముందు పెట్టిన సందేశ ప్రకటనను ఉదహరించారు. సమావేశం సేవ్ ఎడ్యుకేషన్ కమిటి రాష్ట్ర కార్యదర్శి ఎస్. గోవిందరాజులు, ఎడ్యుకేషన్ కమిటీ కర్నూలు నగర అధ్యక్షులు వెంకటరెడ్డి, స్టాన్లీ జయకుమార్, వెంకటరమణ, మల్లిక్ దత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాల పంపిణీ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయమని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి మండలం గోవిందరావుపల్లి పంచాయతీలో నివాసముంటున్న 79 మంది నిరుపేద కుటుంబాలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఎంపీ మద్దెల గురుమూర్తి, గోవిందరావుపల్లి మాజీ సర్పంచ్ కోటి, సుబ్బరాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కణంమిట్ట గ్రామంలో నరసింహ మందడి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రమేష్ యాదవ్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉదయం లేవగానే గంట పాటు నడవాలని.. వ్యాయామం చేయాలని అప్పుడే మన ఆరోగ్యం బాగుంటుందని, బీపీ, షుగర్, గుండెపోటు వంటి వ్యాధుల నుండి రక్షించుకోవచ్చని తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కె శ్రీనివాసులు రెడ్డి, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవిరాజు, డాక్టర్ ఆర్ముగం, డాక్టర్ సుభాషిణి, అధ్యక్షులు రామచంద్రరాజు, ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోనేటి రవిరాజు, కార్యదర్శి గోపీకష్ణ, టి రఘునాథరెడ్డి, కోశాధికారి టి గుణశేఖర్‌రెడ్డి, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటాలు

సీపీఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు



ప్రజాశక్తి-పుత్తూరు: జిల్లా సమగ్రాభివద్ధికి సమరశీల పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు అన్నారు. ఆదివారం రెండోరోజు పుత్తూరులో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనరులు ఉన్న వాటిని జిల్లా అభివద్ధికి వినియోగించుకోవడంలో అధికార పార్టీలు విఫలం చెందాయని.. ఇందులో భాగంగానే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీ, సహకార డెయిరీలను ప్రయివేటీకరణ చేయడానికే వైసిపి, టిడిపి పార్టీలు మొగ్గుచూపుతున్నాయన్నారు. అయితే ప్రభుత్వం సహకారం అందించి వాటిని అభివద్ధి చేయడానికి ఏ మాత్రం ప్రయత్నం చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో ప్రధానంగా మామిడి, చెరకు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు లేక నష్టపోతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసినా యువతకు ఆ కంపెనీల్లో ఆశించిన స్థాయిలో ఉపాధి కల్పించడం లేదని వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, మాధవ్, సాయిలక్ష్మి, హరినాథ్, అరుణాచలం, సీనియర్ నాయకులు ఓ.వెంకటరమణ, చల్లా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతిలో గౌరవాన్ని చాటుకుందాం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తెలుగుజాతి గౌరవాన్ని చాటుకుందామని..ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎన్ఆర్ఐల సహకారం అవసరమని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం ఉదయం అమెరికాలోని డల్లాస్లో టీడీపీ అభిమానులు నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ప్రసంగించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైపోయిందని ధ్వజమెత్తారు. హైటెక్ సిటీ నిర్మాణంతో తెలుగు యువతకు దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. రాష్ట్రం మళ్లీ గాడిన పడాలంటే చంద్రబాబునాయుడును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇందుకుగాను రాష్ట్ర భవిష్యత్తు దష్ట్యా ఎన్ఆర్ఐలు టీడీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. మాతభూమి రుణం తీర్చుకోవడంలో ప్రవాసాంధ్రులు గతంలో పలు అభివద్ధి కార్యక్రమాలను సొంత ఖర్చులతో చేపట్టిన విషయాన్ని కొనియాడారు. అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. అనంతరం నగరి నియోజకవర్గానికి చెందిన ప్రవాసాంధ్రులు అర్చన రావిళ్ల, శ్రీనివాస్ యలకటూరి, వినోద్ దొమ్మరాజు, లక్ష్మీ దొమ్మరాజు, చరణ్ రావిళ్ల, విశాన్వి దొమ్మరాజు గాలి భానుప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. నగరి నుంచి గాలి భానుప్రకాష్ విజయకేతనం ఎగురవేయాలని ఆకాంక్షించారు.

ఉచితంగా కంటి వైద్య సేవలు



ప్రజాశక్తి-క్యాంపస్: స్థానిక జీవకోనలోని విశ్వం హైస్కూల్‌లో ఆదివారం సప్తగిరి ఐ కేర్ సెంటర్, విశ్వం విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఐ స్పెషలిస్ట్, ఆప్తలమిక్ సర్జన్ డాక్టర్ ఐ.తనుష సుమారు 150 మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో చాలా మంది ప్రజలు కంటి జబ్బులతో బాధపడుతున్నారని, కంటి పరీక్షలు చేయించుకునే వెసులుబాటు లేకపోవడం వల్లనో, నిర్లక్ష్యం వల్లనో, అవగాహన లేకపోవడం వల్లనో వారు చికిత్సకు దూరంగా ఉంటున్నారని.. తమకు కంటి జబ్బు ఉన్నా గుర్తించకుండా నెట్టుక వస్తున్న వారున్నారు. వారందరికీ ముందు అవగాహన కల్పించడానికి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, ఎస్వీయూ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఐవీ.రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో ఓ డాక్టర్ ఉండాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రతి మధ్యతరగతి కుటుంబంలో ఓ డాక్టర్ ఉండాలనే ఉద్దేశంతో మెడికో అబ్రాడ్ పనిచేస్తోందని, అందులో భాగంగానే బెలారుస్ దేశంలోని గోమెల్ మెడికల్ యూనివర్సిటితో సులభ వాయిదాల పద్ధతిలో ఫీజులు చెల్లించే అవకాశం ఉందని మేనేజింగ్ పార్ట్నర్ వి.రాజారామ్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రయివేటు హోటల్‌లో గోమెల్ యూనివర్సిటీలో వైద్య విద్యను అభ్యసిస్తున్న వారి పేరెంట్స్(బెలారుస్ పేరెంట్స్ అసోసియేషన్) అవగాహన సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ యూరప్ దేశంలో ఉన్న గోమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో భారతీయ విద్యార్థులు 500 మంది ఉన్నారని, అందులోనూ 250 మంది తిరుపతి పరిసర ప్రాంతాలకు చెందిన వైద్య విద్యార్థులు ఉన్నారన్నారు. మన భారతదేశంలో మెడిసన్ విద్యకు విపరీతమైన పోటీ ఉందన్నారు. బెలారుస్‌లో ఎంబిబిఎస్‌ను పూర్తి చేసి అక్కడే స్పెసిలైజేషన్ కోర్సులు చేస్తూ డాక్టర్లుగా స్థిరపడే అవకాశం ఉందన్నారు. వైద్య విద్యకు ప్రమాణికాలతో కూడిన భోధన గోమెల్‌లో ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి వెయ్యి మందికి ఓ డాక్టర్ ఉండాలని సూచిస్తోందని, బెలారుస్‌లో 1:220 నిష్పత్తిగా ఉందంటే అక్కడ వైద్య విద్యకు ఇస్తున్న ప్రాదాన్యం గమనించవచ్చునన్నారు. పేరెంట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వీర కిరణ్ మాట్లాడుతూ 1990లో స్థాపించిన గోమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఇచ్చిన మార్గదర్శకాలు, నెక్ట్స్ పరీక్షను దృష్టిలో ఉంచుకుని తగిన మార్పులు చేశారని తెలిపారు. ఎంబిబిఎస్, ఎండిలో భారత్‌లో నెక్ట్స్, అమెరికాలో యూఎస్ఎంఎల్ఈ, యూకెలో ప్లాబ్, కెనడాలో ఎంసిసిఈఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో ఏఎంసి ఇలా ఆయా దేశాలలో వైద్య విద్యకు సూచించబడిన మార్గదర్శకాలనుగుణంగా గోమెల్ ' గైడ్‌లైన్స్ ఫర్ సెల్ఫ్ స్టడీ మెటీరియల్స్‌ను అందిస్తుందన్నారు. ఇలాంటి అవకాశాలను ఎవరైతే విదేశీ విద్యను అభ్యసించాలనుకుంటారో వారికి చక్కటి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ప్రియావర్ధన్‌బాబు, ప్రధాన కార్యదర్శి జె.గోపి, సంయుక్త కార్యదర్శులు రామక్రిష్ణయ్య, రాధాతులసి, నాగేంద్రబాబు, మెడికో అబ్రాడ్ బిజినెస్ డైరెక్టర్ ప్రియా, అడ్మిషన్ డైరెక్టర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని నలుగురికి గాయాలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు కుటుంబ సభ్యులు గాయపడిన సంఘటన పుత్తూరు మండలం పరిధిలో ఆదివారం జరిగింది. గోపాలకృష్ణాపురం గ్రామానికి చెందిన శేఖర్ తన భార్యపిల్లలతో ద్విచక్రవాహనంపై పుత్తూరుకు వెళుతుండగా.. తడుకు పంచాయతీ మజ్జిగగుంట వద్ద తిరుపతి వెళుతున్న కారు ఢీకొంది. ప్రమాదంలో శేఖర్‌తోపాటు భార్య పిల్లలు గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు తాలూకా శ్రీకష్ణ యాదవ ఉద్యోగుల సేవా సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం పుత్తూరులోని శ్రీకష్ణ మందిరంలో జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చల్లా మునికష్ణయ్య, కార్యదర్శిగా లక్ష్మీపతి, గౌరవ అధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది రవీంద్ర, కోశాధికారిగా సోమశేఖర్, సహాధ్యక్షులుగా వెంకట రమణయ్య, జయచంద్ర, సంయుక్త కార్యదర్శిగా డి.ఎం. వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా నాగరాజు, భీమారావు గుర్రప్ప, కార్యనిర్వహణ కార్యదర్శులుగా ఎస్.బాబు, వెంకటరత్నం, టి. మునస్వామి, కార్యవర్గ సభ్యులను నియమించారు.

పెరిగిన బస్సు ఛార్జీలు తగ్గించాలి



ప్రజాశక్తి-వెంకటగిరి: పెరిగిన బస్సు ఛార్జీలను తగ్గించాలని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక త్రిభువని సెంటరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలు ప్రయాణాలు సాగించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. బస్సు ఛార్జీలు విపరీతంగా పెంచే సాహసం ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. వైసీపీ అన్ని ఛార్జీలను పేదలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.